'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

# శిక్ష

-దేవిరెడ్డి



రాజమండ్రి సెంట్రల్ జైలు. అక్టోబర్ ఒకటి. సాధారణ జనానికది గాంధీగారు పుట్టిన రోజు. ఉద్యోగస్తులకు శలవు రోజు. రాజకీయ నాయకులకు ఆరోజు చాలా ముఖ్యమైన దినం. గాంధీగారి జయంతిని పండుగలా జరుపుకునే వారు మరొకరున్నారని నాకు ఆరోజే తెలిసింది. ఆరోజు 'ప్రిజనర్స్ డే'గా ప్రకటించిన ప్రభుత్వం ఖైదీలకు పండుగ రోజుగా చేసింది. గాంధీగారి విగ్రహాలు రాజకీయ నాయకుల ఓట్ల బ్యాంకు అని తెలుసుకొని, ఖైదీల ఆనందానికి ఇంతటి కారణము గాంధీగారేనని ఒక కేసులో శిక్ష పడి జైలుకొచ్చిన నాకు అప్పుడే తెలిసింది.

రాజమండ్రి సెంట్రల్ జైలు పేరుకు తగ్గట్టే చాల పెద్దది. ఒక చిన్న గ్రామంలా వుంటుంది. లోపల ఖైదీలకోసం గదులే కాక, పంట పొలాలు, ఖైదీలు చదువుకోటానికి గ్రంథాలయం, పాఠశాలలు, పనులు నేర్చుకోవడానికి చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఉన్నాయి. ఖైదీలకు శారీరక శ్రమవల్ల మానసిక విశ్రాంతి కలుగుతుందని పొలం పనులు, శిక్షా కాలం పూర్తయిన తరువాత వాళ్ళకు 'ఉపాధి'గా ఉపయోగపడుతుందని కుటీర పరిశ్రమలలో పనులు నేర్పుతారే తప్ప వాళ్ళను క్షోభ పెట్టాలని కాదు.

దాదాపు పదెకరాల స్థలం మధ్యలో ఆఫీసు, దాని చుట్టురా విస్తరించి ఉన్న జైలు బ్యారక్స్. పర్యవేక్షణకు వీలుగా వుంటుందని అలా కట్టి ఉండవచ్చు. ఆఫీసు చుట్టురా అందమైన పూల మొక్కలు, నీడ కోసం కొన్ని వృక్షాలు. ఆఫీసును రంగు కాగితాలతో అలంకరిస్తున్న ఖైదీలు.

ఇంతలోనే 'కూ'...అంటూ కూని రాగాలతో ఆరంభమైన 'సైరన్'మ్రోత జైలు మొత్తాన్ని 'ఎలర్ట్'చేస్తూ చెవ్వులు చిల్లులు పడేలా ప్రతిధ్వనించింది. పాత ఖైదీలకు 'సైరన్' ఎందుకు మ్రోగిందో తెలుసుకనుక ఎక్కడ పనులు అక్కడ వదిలి వెళుతూ, నిలబడి ఉన్న మిగతా ఖైదీలను కూడా వెళ్ళిపొమ్మన్నారు. జరిగిందేమిటో తెలియకపోయినా అలా వెళ్ళటమే మంచిదని పాత ఖైదీలను అనుసరిస్తున్న మిగతా ఖైదీలకు చేతిలో లాఠీతో అక్కడకొచ్చిన వార్డెన్ హెచ్చరికతో అక్కడనుండి మరింత వేగంగా వెళ్ళిపోతున్నారు.

నేను కూడా అక్కడ ఉండటం మంచిది కాదనిపించి నా బ్లాక్‌లోకి చేరాను. ఎవరి బ్లాక్‌లోకి వాళ్ళు వెళ్ళిన తరువాత ఇక ఖైదీలు బయట ఎవరూ లేరని నిశ్చయించుకున్న డ్యూటీలో ఉన్న వార్డెన్లు బ్లాక్ మెయిన్‌గేటు తలుపులు మూసివేసారు.

జైలు సైరన్ అత్యవసర పరిస్థితులలో మాత్రమే మ్రోగుతుంది. అంటే ఏదైనా ప్రమాద పరిస్థితి ఖైదీలు పారిపోవటం, కొట్లాట, హత్యలు, ఆత్మహత్యలు జరిగినప్పుడు. బ్లాక్‌లో ప్రవేశించిన ఖైదీలు క్రమశిక్షణవల్ల సైనికుల్లా అడ్డం ఐదుగురు, నిలువు పన్నెండు మంది మిగిలిన ముగ్గురు ఒక వరసలో కూర్చున్నారు. వరసగా కూర్చున్న ఖైదీలను లెక్కపెట్టటానికి పెద్దగా టైంపట్టలేదు వార్డెన్‌కు. లెక్క తీసుకొని బ్యారక్ నుండి ఎవరూ బయటకు రావద్దని చెప్పి వార్డెన్ వెళ్ళిపోయాడు.

తుపాన్ ముందున్న ప్రశాంతత వార్డెన్ వెళ్ళిపోగానే ఒక్కసారిగా చెదరిపోయింది. అందరూ మాటల్లో పడ్డారు. కొందరి మొకాల్లో సాయంత్రం పండుగ జరుగుతుందో లేదో అని ఆందోళన.

అసలు విషయం అర్థంకాని నేను ప్రక్కనే వున్న జానీని అడిగాను.

"ఏం జరిగిందని ఈ గోల".

"ఎవరో హాస్పటల్ దగ్గర ఉన్న మర్రి చెట్టుకు ఉరేసుకున్నాడట"

"ఎవరు".

"తెలియదు" అతని సమాధానం.

"ఉన్నాడా, పోయాడా" కొద్దిగా విసుగ్గా అడిగాను.

"అది తెలియాలన్నా కనీసం రెండు దినాలైనా ఓపిక పట్టాలి భాయ్".

"చచ్చింది, బ్రతికింది తెలియడానికి కూడా పోస్టుమార్టమ్ చెయ్యాలా ఏమిటి"

"అదేం కాదు గాని అతను ఉరివేసుకోవడం వెంటనే గమనించి 'హాస్పటల్'కు తీసుకెళ్ళారట. బ్రతికే అవకాశమే ఎక్కువగా వుందంటున్నారు. అతనిని చెట్టుమీద నుండి దించినవాడు చనిపోయాడు అని చెపుతున్నాడు. ఏది నమ్మాల్లో అర్థం కావటంలేదు.

"ఆ దించినవాడ్నే అడిగితే పోలా" అన్నాను నేను.

ఆ దించినవాడు ఎవరో ఎవరితోనో అంటే అతను ఇంకొకరితో అంటే, అతను మరొకరితో అంటే ఆ మరొకతను ఇంకో అతనితో అంటే... అతను అలా చెప్పుకుపోతూనే ఉన్నాడు.

"ఇక ఆపు నాయినా. నిజం ఎవరిని అడిగితే తెలుస్తుందో చెప్పు" అన్నాను.

"మరి జైలు అంటే ఏమిటనుకున్నావు. ఏది ఎవరన్నారో, ఎందుకన్నారో, అసలు విషయం ఎక్కడ ఆరంభమైందో తెలియడం చాలా కష్టం. అసలు విషయం తెలియాలి అంటే రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి పంపిన ఆ మనిషి తిరిగొచ్చిందాక ఎదురు చూడటమే"అన్నాడు తను అనుభవాల్ని తెలియపరుస్తూ.

జైలులో ఏ విషయమైన ఖచ్చితంగా తెలియాలి అంటే ఎంతో కష్టమైన విషయం అని తెలుసుకున్న నేను నా బ్లాక్ నుండి బయటపడదామనుకుంటూ అడుగులు గేటువైపు వేసాను.

"కుమార్" ఎవరో వెనుకనుండి పిలిచారు. మా బ్లాక్‌లోని శాయిబాబా గుడి ఎదురుగా వున్న చెట్టు సమీపంలో నిలబడున్న వెంకట్రావు నన్ను పిలిచాడు.

వస్తున్నానని తెలియజేయటానికన్నట్లు చేతితోనే సంజ్ఞచేసి అతనికేసి నడిచాను. నేను అతనికి దగ్గరగా రావటంతో అతను చెట్టు నీడలోకి మరి కొన్ని అడుగులేసాడు. అతనిని అనుసరించాను నేను.

అతను నడక ఆపి నావైపు తిరిగి "ఉరివేసుకుంది ఎవరో తెలుసా" అన్నాడు.

"నాకు తెలియదు. ఎవరూ చెప్పటం లేదు."

"మన నాగేంద్ర మట".

అతని మాటలు నమ్మలేనట్లు చూసాను. రాత్రంతా నాతో మాట్లాడిన మనిషి ఉదయం ఉత్సాహంగా పనిలోకి వెళ్ళిన మనిషి ఆత్మహత్యకు ప్రయత్నించాడు అంటే నమ్మకం కలగటంలేదు. కొన్ని విషయాలు నమ్మటానికి కొంతకాలం పడుతుందేమోననిపించింది. అది జరిగింది అని తెలిసినా అలా జరగలేదనే అనుకుంటాము. అలా అనుకోకపోతే మన మనస్సుచేసే అలజడికి శరీరం తట్టుకోలేదేమో.

నాగేంద్ర జీవిత ఖైదీ. అతను చాల పద్ధతిగల మనిషి. చదువుకున్నవాడు. అతని మాట ఎంతో సౌమ్యంగా వుండేది. అతను సరే బస్సు దహనపు కేసుల్లో, డెకాయిటీ కేసుల్లో, కిరాతకంగా వెంటపడి హత్యలు చేసినవారు సైతం ఎంతో మానవతావాదుల్లా మాట్లాడేవారు. దానికి కారణం జైలు వాతావరణం, ఆహారపు అలవాట్లు కావచ్చు. ఒంటరితనం కూడా మనిషిలోని మంచిచెడులను అంచనా వేసుకునే పరిస్థితిని కలుగచేస్తుందనుకుంటా.

జీవిత ఖైదీలు తక్కువ శిక్ష పడ్డ వాళ్ళతో అంత అనుబంధంగా వుండరు. తక్కువ శిక్ష పడ్డవాళ్ళు తమ శిక్షా కాలాన్ని

పూర్తిచేసుకొని వెళ్ళిపోతుంటే, జీవిత ఖైదీలు తమ ఆత్మీయులను కోల్పోతున్నట్లు బాధపడతారు. అది భరించలేక ఒక్కొక్కసారి శిక్ష పూర్తయిన ఖైదీలు వెళ్ళిపోతున్న వారు జైలు గదుల్లోనుండి బయటకు రారు. ఖైదీ జీవితం రైలు ప్రయాణానికి చాల దగ్గర పోలికుంది. ఎవరి గమ్యస్థానంలో వారు దిగిపోవటం సహజం అనుకుంటేనే వారి మనుగడ.

జీవిత ఖైదీలందరూ ఎక్కువ మందిని ఒకే బ్లాక్‌లో వుంచుతారు. ఒక బ్లాక్ సరిపోకపోతే మరొక బ్లాక్ వాళ్ళ కోసం కేటాయిస్తారు. జీవిత ఖైదీలకంటూ ప్రత్యేకమైన బ్లాక్స్‌ను ఏర్పాటుచేయడంలో గూడా ఖైదీల పట్ల జైలు అధికారుల దయార్ద్ర హృదయం కనిపించక మానదు. నేను నాగేంద్రలోని మంచితనంవల్లే అతనితో స్నేహం పెంచుకున్నాను. అతను కష్టాలు నాతో చెప్పుకుంటుంటే ఓదార్చటం నాకెంతో సంతృప్తిగా ఉండేది. ఆ మాత్రం నా వల్ల అతనికి ఆనందం కలగటమే దానికి కారణం కావచ్చు.

జైలులో ప్రతి వ్యక్తికి ఒక దీనగాథ ఉంటుంది. ఆర్థికంగా దెబ్బతిన్న వారే జైలుకి ఎక్కువ వస్తారు. డబ్బే ఉంటే జైలే కాదు కోర్టు మొకం కూడా చూడకుండా తప్పించుకునే లొసుగులు మన చట్టాలకున్నాయి. ప్రభువులు మాత్రం చట్టం తన పని తను చేసుకపోతుందని అంటారు. నీతి నిజాయితీ చట్టపరిధిలో ఏమాత్రం ఉండవని తెలిసినా.

నాగేంద్ర తనది ప్రేమ వివాహమని, తనకు ఇద్దరు పిల్లలని చెప్పేవాడు. పిల్లలన్నా, భార్యన్నా అతనికెంతో ప్రేమాభిమానాలని అతని మాటల్లో తెలిసేది. మరి అది తనవారు దూరమైన పెరిగే అనురాగమూ కావచ్చు.

రాత్రి పడుకునేముందు నాగేంద్ర నాకో ఉత్తరం ఇచ్చాడు. ఆ ఉత్తరంలో తను ఉరివేసుకోవడానికిగల కారణాలు వ్రాసి ఉండవచ్చు. ఆత్రుతతో నా గదిలో అతను ఇచ్చిన ఉత్తరం కోసం వెదికేటందుకు నా జైలు పడక బట్టల మూట ఇప్పాను. జైలు బట్టలంటే జైలుకు రాగానే శిక్ష పడ్డ ఖైదీల నుండి బయట నుండి తెచ్చిన బట్టలు తీసుకొని రెండు జతల బట్టలు, ఒక దుప్పటి, ఒక చాప లాంటి పురితాడుతో పేనిన పట్ట ఇస్తారు. యావజ్జీవ శిక్ష పడ్డవారికి సంవత్సరం, సంవత్సరం క్రొత్త బట్టలు ఇస్తారట.

చుట్టపెట్టిన నా పడక బట్టలు ఇప్పదీసి బట్టలు విదిల్చాను. చొక్కా మడతలో జాగ్రత్తగా పెట్టిన కవర్ క్రింద పడింది. కవర్ తీసి దానిలోని ఉత్తరాన్ని అక్కడే చదవాలనుకున్నాను. అటు - ఇటు తిరుగుతున్న ఖైదీలు ఎవరైనా ఆ ఉత్తరాన్ని గమనిస్తే ప్రమాదమని తలచి ఆ పనిని విరమించాను. జైలు పరిమిత ప్రపంచం అయినందున గోరంతను కొండంతగా మారుస్తారు ఖైదీలు. ఆ ఉత్తరం అక్కడే చదవాలన్న కోర్కెను అణుచుకొని చొక్క జేబులో పెట్టుకొని ప్రక్క బ్లాక్‌లో శివుని గుడివైపు అడుగువేసాను.

అప్పటివరకు హడావిడిగా కనిపించిన జైలు కాస్తంత సద్దుమణిగింది. ఎవరి పనుల్లోవారు నిమగ్నమైయ్యారు. రంగు కాయితాలతోపాటు, రంగు డబ్బాలు తెప్పించి వాటితో అందమైన డిజైన్లు వేస్తున్నారు. ఇంటిని కూడా అంత అలంకరించుకోరేమో అనుకోక మానరు వాళ్ళకు పని పట్ల శ్రద్ధ గమనించిన వారెవరైన.

కాలాన్నిబట్టి పద్ధతులు మారిపోతున్నాయి. ఖైదీలు ఎంతటి దుర్మార్గులైన వాళ్ళను సత్‌ప్రవర్తకులుగా మార్చి బయటకు పంపాలి అనే సద్భావన జైలు అధికారుల్లో లేకపోలేదు. కాకీ బట్టలు వేసుకున్నా, 'కాకీ'ల కర్కశత్వము వారి ప్రవర్తనలో కనిపించదు. మర్యాదగా నడుచుకుంటే జైలు అధికారుల ప్రేమాభిమానాలు ప్రతి ఖైదీకి లభిస్తాయి. జైలు అధికారులకు బయటకు వెళ్ళే స్వేచ్ఛున్నా, వాళ్ళు ఖైదీలతోపాటు జైలులో వారి బాధ్యతలకు బందీలే. వాళ్ళ అనుబంధం ఎక్కువ ఖైదీలతోనే. జైలు అధికారుల మాటలు కూడా ఖైదీలకు జీవితంపై ఎంతోకొంత ఆశలు పెంచుతాయి. మరి జైలు అధికారులకు అలా ట్రైనింగ్ ఇస్తారేమో.

నాగేంద్ర డబ్బు విషయంలో చాలా పొదుపుగా వుండేవాడు. అతను జైలులో వంట పనికి కుదిరాడు. కట్టెల పొయ్యి పని చాలా కష్టమైందే అయినా జైలులో మిగతా పనుల్లోకంటే జీతం కాస్త ఎక్కువ కొంచెం ఆదాయంతోపాటు చిన్న సౌకర్యాలు కూడా ఉండేవి. అతను నెల పొడుగునా ఆదాచేసిన డబ్బు భార్యకు మనియార్డర్ చేసేవాడు.

నాగేంద్ర పంపుతున్న డబ్బు తన కుటుంబాన్ని సుఖసంతోషంతో ముంచెత్తకపోయినా కొన్ని అవసరాలైనా తీరేవి.



నాగేంద్ర డబ్బు విషయంలో చాలా పొదుపుగా వుండేవాడు. అతను జైలులో వంట పనికి కుదిరాడు. కట్టెల పొయ్యి పని చాలా కష్టమైందే అయినా జైలులో మిగతా పనుల్లో కంటే జీతం కాస్త ఎక్కువ కొంచెం ఆదాయంతోపాటు చిన్న సౌకర్యాలు కూడా ఉండేవి. అతను నెల పొడుగునా ఆదాచేసిన డబ్బు భార్యకు మనియార్డర్ చేసేవాడు.

నాగేంద్రే కాదు, జైలులో చాలమంది జీవిత ఖైదీలు ఎక్కువ ఆదాయం వచ్చే పొలం, తోట, వంట పనులు లాంటివి చేసేవారు. వచ్చిన డబ్బు జైలులో వారి ఖాతాకు జమ అయ్యేది. జమ అయిన డబ్బును కొంతమంది ఇంటికి పంపేవారు మరి కొంతమంది తమ అవసరాలకు విలాసాలకు వాడుకునేవారు.

రాత్రి అతని సంభాషణలలో చనిపోవాలనే కోర్కె ఎక్కడైనా వ్యక్తం చేసాడా అని ఆలోచించాను. జైలులో వారానికి ఒకసారి తలకు రాసుకునేందుకు కొబ్బరి నూనె, బట్టలు ఉతుక్కోవటానికి బట్టల షోడా, సబ్బు, స్నానానికి మరొక సబ్బు ఇచ్చేవాళ్ళు. అలా వారానికి ఒకసారి ఇచ్చే కొబ్బరి నూనె అడిగి కాస్త ఎక్కువ పోయించుకుంటాము. మాతో ఉన్న అవసరాన్నిబట్టి ఎదుట మనిషి మనకు ఉపయోగపడటం బయట ప్రపంచంలోనే కాదు జైలులో కూడా సహజమే.

సాయంత్రం భోజనం నాలుగు అయిదు గంటల మధ్యే పూర్తవుతుంది. ప్రతి గదికి వెళ్ళి భోజనం అందించాలంటే జైలులో ఉన్న సిబ్బంది సరిపోరు. భోజనాలు అయిపోయిన వెంటనే ఎవరికివారే హడావిడిగా పనులు ముగించుకొని జైలు మెయిన్ గేటుగుండా ప్రవేశిస్తున్న ఖైదీలను వార్డెన్ లెక్కపెట్టుకోవడం, లెక్క సరిచూసుకొన్న తరువాత తాళం వేసుకొని వెళ్ళిపోవడం మామూలే.

నాగేంద్ర వంట పని చేయడంవల్ల లభించే అదనపు సౌకర్యాలలో 'టీ' ఒకటి. జైలులో పన్నెండు గంటలకు టీ ఇస్తారు. అప్పుడిచ్చిన టీని, అలా అదనంగా నాగేంద్ర తీసుకొచ్చిన టీని జైలువారిచ్చిన సత్తు గ్లాసులలో నిల్వ ఉంచుకొని రాత్రి పూట త్రాగటం అలవాటు.

ప్రక్కనే వున్న బట్టల మూట నుండి పాత చొక్కా ఒకటి తీసి దానినుండి ఒక ముక్క తీసుకొని గుండ్రంగా చుట్టి దానిమీద జైలువారు తలకు రాసుకునేందుకిచ్చిన నూనెను ఆ గుడ్డ మండటానికి వీలైనంత నూనే వేసి, జేబులోనుండి అగ్గి పెట్టి తీసి దానిని వెలిగించాడు. జైలులో అగ్గిపెట్టెలు, బీడీలు చాలా విలువైనవి. అవి కావలసినన్ని దొరికినా వాటిని కొనేందుకు తగిన డబ్బు ఖైదీల దగ్గర ఉండేవి కదా!

సన్నగా వెలుగుతున్న గుట్టి పొయ్యి మీద సత్తు గ్లాసులోని టీని వేడి చేసే పనిలో పడ్డాడు. "మనవల్ల ఎవరికి ప్రయోజనం. కనీసం మన వాళ్ళకు కూడా మనం ఉపయోగపడనప్పుడు ఈ జీవితం ఏ లక్ష్యంతో కొనసాగాలో అర్థంకాదు" అన్నాడు తన పని తను చేస్తూనే.

ప్రయోజనం అనేది మనం ఆలోచించే దానినిబట్టి ఉంటుంది. ఇలా మనకు శిక్షలు వేయబట్టే నేరం చెయ్యాలంటే కొంతమందైనా భయపడతారు కదా? అది ఒక ప్రయోజనమే అన్నాను నేను అతని మాటలలో ఏకీభవించటం ఇష్టం లేనట్లు.

"శిక్షల వల్ల నేరాలు మానివేస్తారు అనుకోవడం పొరపాటు. నేరం చేసే ప్రతివాడికి శిక్షలు ఉంటాయని తెలుసు. తమ తెలివితేటలతో, డబ్బు, అధికారాల అహంకారంతో తప్పించుకోవచ్చు అనుకుంటాడు. అలాగే ఎందరో తప్పించుకుంటున్నారు. ఏ అండదండలు లేని అమాయకులే నేరం చెయ్యకపోయినా బలిపశువులుగా మిగులుతున్నారు" అన్నాడు ఆవేశంగా.

అతని ఆవేశంలో నిజం లేకపోలేదు. ఇద్దరి వ్యక్తులను పిట్టలను కాల్చినట్టు కాల్చిన ప్రముఖ నటుడితోపాటు, ఎంతమంది రాజకీయ నాయకులపై హత్యానేరాలు రుజువయ్యాయి. హర్షద్ మెహతా లాంటి ఆర్థిక నేరస్థులు ఏమయ్యారు. ఎన్నెన్నో చేదు నిజాలు కళ్ళముందు కనిపిస్తుంటే ఆలోచిస్తున్న నాతో పనిలేనట్లు మరలా నాగేంద్రే మొదలు పెట్టాడు.

"నేరం చేసిన ప్రతి వ్యక్తికి కోర్టులు శిక్షలు వెయ్యడం పెడితే ఇప్పుడున్న జైలును పది రెట్లు పెంచినా కిక్కిరిసిపోతాయేమో. దొరికితే దొంగ లేకుంటే దొరలే."

జైలుకొచ్చిన ప్రతి వ్యక్తి నేరస్తుడు కాకపోవచ్చు కాని, ఏ నేరం చెయ్యకుండానే శిక్షలు అనుభవిస్తున్నారంటే నేనంగీకరించలేను. నా విషయం తీసుకుందాం. నాది చెక్కు బౌన్స్ కేసు. నిజానికి చెక్కుమీద సంతకం నాదే. ప్రతి నెల నమ్మకంతో నగదు రూపంలో డబ్బు చెల్లించాను. కేవలం హామీగా మాత్రమే అంటే నాకు అతనికి ఏమైనా టరమ్స్ చెడినప్పుడు మాత్రమే మిగిలిన మొత్తానికి చెక్కుతో డబ్బు తీసుకొనేలా ఒప్పందం జరిగింది.

ఇది కేవలం అవతలి వ్యక్తిమీద మనకున్న నమ్మకం, మన అవసరాన్ని బట్టి ఇలాంటి విషయాలలో ఒప్పందాలు జరుగుతాయి. వేరే వ్యక్తిని గురించి అడిగినప్పుడు నాకు అతనికి కొద్ది స్నేహం ఉండటంతో నాకు తెలిసినంత వరకు మంచివాడేనని చెప్పాను. అతను డబ్బు సరిగా కట్టలేదట. అందుకని నన్ను ఇమ్మన్నాడు. మంచివాడు అని చెప్పినంత మాత్రానే నన్ను అడగటం భావ్యంగాలేదని చెప్పిన అతను వినిపించుకోలేదు. అతను ఇవ్వాల్సిన మొత్తానికి నేను ఇచ్చిన ఖాళీ చెక్కుమీద వ్రాసి బ్యాంకులో వేసాడు. అంత డబ్బు నేను కట్టలేకపోవటంవల్ల, సాక్ష్యాలు అతనికి అనుకూలంగా ఉండటంవల్ల నాకు శిక్ష. నానుండి ఎంతోకొంత రాబట్టుకోవాలని ఆ ఫైనాన్స్ వ్యాపారి ప్రయత్నం నా దగ్గర

పబ్బులేకపోవటంవల్ల వృధా అయ్యింది. ఇది నా ఒక్కడి కన్నీటి కథే కాదు. ఇలాంటి వారు చాలమంది ఉండవచ్చు. స్నేహితుల హామీకోసం చెక్కులు ఇవ్వడం, వ్యాపార నమ్మకంకోసం ముందుగానే ఖాళీ చెక్కులు ఇవ్వడం, నమ్మకంతో ఒక అవసరానికిచ్చిన చెక్కు మరొక అవసరానికి వాడటం. అంతా మామూలుగా జరుగుతుందనే అనుకొని కొన్నిసార్లు బలిపశువులుగా మిగిలిపోతాం.

ఆరిపోతున్న గుడ్డపొయ్యి మీద మరింత నూనె పొయ్యటంతో ఒక్కసారిగా మంట పెద్దదై నాగేంద్ర చేతిని కాల్చింది. గ్లాసు ప్రక్కనపెట్టి చెయ్యి విదిలిస్తూ "ఏం మాట్లాడవేం" అన్నాడు.

"నీ మాటల్లో నిజాలను గురించి ఆలోచిస్తున్నాను" అన్నాను.

నాగేంద్ర మళ్ళీ తన ధోరణి కొనసాగించాడు" అంతా జీవిత ఖైదిలేనాయె. వాళ్ళలో నిరాశ కోపం రూపంలో ప్రక్కవాడి మీద చూపిస్తుంటారు. అందుకే నేనెవ్వరితో మాట్లాడేవాడిని కాను. నువ్వొచ్చిన తరువాతే ఇలా మాటలు నిన్ను ఇబ్బంది పెడితే క్షమించూ" అంటూ ప్రక్కనే ఉన్న గ్లాసులో 'టీ'వేడి అయినధి లేనిది చూసాడు. ఆ వేడి అతనికి తృప్తినిచ్చినట్లు లేదు.

"నిజమే మరి వారి జీవితాలు ఇక్కడే సరిపుచ్చుకోవాలాయె. మనిషికి కోపం సహజమైంది కదా! అందులోని వారి మనస్సుల్లో కలిగే ఆందోళన మరింత కోపాన్ని పెంచుతుంది. జీవించటం పట్ల అభద్రతా భావాన్ని కల్గిస్తుంది."

"తక్కువ శిక్ష పడ్డ ఖైదీకయితే నెలకో, సంవత్సరానికో బయటకు వెళతాను అనే ఆశ వుంటుంది. జీవితఖైదు అనుభవిస్తున్న వారికి ఆ అవకాశం తక్కువే కదా?" అంటూ నాగేంద్ర ప్రక్కనే పట్టుకారులాగవున్న పల్చని రేకుతో సత్తు గ్లాసును పట్టుకొని మండుతున్న గుడ్డపొయ్యితో వేడి చెయ్యటం మొదలుపెట్టాడు రెండోసారి.

సమయానికి కావలసిన ఇలాంటి వస్తువులు ఇంటిలో ఉంటాయో లేదో తెలియదు కాని అవసరాన్నిపట్టి అన్ని వస్తువులు తయారు చేసుకోవటం ఖైదీల చతురత. ఒక్కొక్కసారి ఖైదీల తెలివి తేటలకు ఆశ్చర్యం ప్రకటించక తప్పదు. ఆదిమ మానవుడు అవసరాన్నిబట్టి అన్ని వస్తువులు తయారుచేసుకున్నట్లే, పనికిరాని వస్తువులతో తమకు కావలసిన రూపాలను కల్పిస్తారు ఖైదీలు.


నాగేంద్ర సన్నగా పొడవుగావున్న రేకు ముక్కని తెచ్చి మా గదిలో పెడుతుంటే "ఎందుకీ దరిద్రం" అంటూ బయటకు విసిరేసాను.

నేను పారేసిన ఆ రేకును లోపలికి తెస్తూ "ఇంతకన్నా మనం అనుభవించే దరిద్రం ఏముంటుంది. జైలుకు రావడంకన్నా దరిద్రమేముంది" -అంటూ చేతిలో ఉన్న రేకు ముక్కను పట్టుకారు ఎలా మలుచుకోవచ్చో చూపెట్టాడు. అలా తయారైన పట్టుకారుతోనే టీని గుడ్డపొయ్యి మంటతో వేడి చేస్తున్నాడు.

'టీ'బాగా కాగినట్లుంది. పైకి పొంగుకొస్తున్నాయి. అంతటితో గ్లాసును ప్రక్కనపెట్టి గుడ్డపొయ్యి ఆర్పివేసి టీని మరో రెండు సత్తు గ్లాసుల్లోకి సర్దాడు. ఒక గ్లాసు నా చేతికిచ్చి ఇది వెంకట్రావుకిచ్చెయ్ అన్నాడు.

ప్రతి గదికి చువ్వలతో వేసిన తలుపులున్నా అవి గదిలోకి రావడానికి మాత్రమే ఉపయోగపడతాయి. ఆరు గదులను కలుపుతూ ఒక సన్నని సందు వుంటుంది. దాని ద్వారా ఒక గదిలోకి ఖైది మరొక గదిలో వ్యక్తితో కలవచ్చు. ఈ ఆరు గదులలో ఖైదీలు కోసం ఒక గదిలో టి.వి కూడా వుంది. టి.వి చూస్తున్న వెంకట్రావుకు 'టీ'ఇచ్చి మరలా మా గదిలోకి నేను వచ్చాను. టీ.వీ ఉన్న గది మా గది తరువాత రెండవ గది. అందువల్ల మా గదిలో నుండి 'టీ'విని చూడవచ్చు. నాకోసం సిద్ధంగా వుంచిన 'టీ' త్రాగుతూ 'టి.వి.'లో వస్తున్న డే నైట్ క్రికెట్ మ్యాచ్‌ని చూస్తున్నాము.

వెంకట్రావు జీవిత ఖైదే. అతనిని చూడటానికి వచ్చే బంధువులు అతనికోసం ఊరగాయ పచ్చళ్ళు జైలువాళ్ళ



అనుమతితో జైలు రూల్స్ ప్రకారం అతనికి ఉపయోగపడే వస్తువులు తెచ్చి ఇచ్చేవాళ్ళు. అతను మాకు అప్పుడప్పుడు ఊరగాయ పచ్చళ్ళు రుచి చూపేవాడు. మరి మాకోసం ఎవరూ రారు కదా! మాకు అతనిలాగ పచ్చళ్ళు తెచ్చేవాళ్ళెవ్వరూ లేరు కనుక అతను పెట్టిన పచ్చడినే మహాప్రసాదంగా భావించేవాళ్ళం. మరి దానికి ప్రతిఫలంగా మేము ఏదోఒకటి చెయ్యాలని అప్పుడప్పుడూ ఇలా ఎక్కువగా 'టీ' ఉంటే అతనిని మాలో భాగస్వామిగా చేసుకునేవాళ్ళం.

'టీ' త్రాగిన తరువాత టీ.విలో వస్తున్న మ్యాచ్‌లో అందరు నిమగ్నమై పోవటం గమనించిన నాగేందర్ తన తలగడ క్రింద పెట్టుకున్న పోస్టల్ ఎన్వలప్ కవర్ నా చేతికి అందిస్తూ 'దీన్ని ఎలాగైనా సెన్సార్ కాకుండా బయటకు పంపాలి' అన్నాడు.

జైలులో ప్రతి ఉత్తరమూ సెన్సార్ చేసిన తరువాతే బయటకెళుతుంది. అలా సెన్సార్ కాకుండా వెళ్ళడం చాలా కష్టం. జైలులో జరిగే లోపలే కాక, ఖైదీలు తప్పించుకోవటం కోసం ఎవరి సహాయమైన అర్థిస్తారేమోనన్న భయం. జైలు అధికారులు ఎంత జాగ్రత్తగా సెన్సారు కార్యక్రమాన్ని నిర్వర్తించినా, కొన్ని విషయాలు జైలు గోడలు దాటి ఎవరికి తెలియకుండా వెళ్ళిపోతూనే ఉంటాయి.

జైలులో ఊరక తింటూ కూర్చునే బదులు ఏదైనా పనిలో పడితే కొంత మానసికమైన ఆందోళనను కట్టడి చేయవచ్చు. మానసిక ఆందోళనకు చాల మంది ఖైదీలు బీడిలనే నమ్ముకుంటారు. జైలులో ఖర్చుకోసం నెలకు చాల తక్కువ మొత్తాన్ని మాత్రమే వాడుకోవాలి. ఖర్చులే కాదని జైలులో లేచిన దగ్గరనుండి పడుకునే వరకు అన్నిటికి కొన్ని పరిమితులుంటాయి. స్వేచ్ఛ ఉంటే మరి జైలుకు బయటవాళ్ళకు తేడా ఏముంటుంది. పరిమితులకు లోబడి ఖర్చు పెట్టుకోవాలి కనుక ఎంతటి గొప్పవారైనా బీడీలనే నమ్ముకోక తప్పదు. బీడీలు ఆందోళన తగ్గిస్తాయో లేదో తెలియదు కాని ఆ బీడీ ముక్కల కోసం ఖైదీలు పడే బాధలు చెప్పుకోక తప్పదు.

నేనూ జైలరుగారి వద్ద ఆర్డర్లీగా పనిచేస్తున్నందువల్ల నాకు జైలులో చాలమందితో తక్కువ కాలములోనే ఎక్కువ పరిచయమైంది.

అందువల్లె ఆ ఉత్తరాన్ని బయటకు పంపే బాధ్యత నామీద పెట్టాడు నాగేంద్ర.

ఆ ఉత్తరం ఎలా పంపుతానో అర్థంకాక అతని మనస్సు ఆందోళన పడుతున్నట్లు అతని మొకంలో స్పష్టంగా కనిపిస్తుంది. అతని అనుమానం నివృత్తి చేయడంకోసమన్నట్లు నేనే చెప్పాను. నువ్వేమి ఆందోళన చెందకు. జైలరుగారి ఇంటికి వెళ్ళే రాముతో ఆ కవర్ బయటకు పంపిస్తాను. దానిని జైలు గేటు బయట జైలరిగారి ఇంటికి వెళ్ళే దారిలోనున్న పోస్టుబాక్స్‌లో వేస్తాడు" అన్నాను.

శిక్షా కాలం పూర్తి అయ్యి ఇంకా నెలో రెండునెలలో శిక్ష ఉన్న వాళ్ళను జైలరిగారి ఇంట్లో, సూపర్నెంటుగారి ఇంట్లో, జైలుకు సంబంధించిన ఇతర అధికారుల ఇండ్లలో పనులకు ఉపయోగించుకుంటారు. అది ఖైదీలకు సమ్మతి అయితేనే. అలాంటి ఖైదీలలో రాము జైలరిగారి ఇంట్లో పనిచేసే వాళ్ళలో నమ్మకమైన వాడు. నాకూ పరిచయమున్నవాడూ.

జైలు గదుల చువ్వల తలుపుల మీద 'లాటీ' లాంటి కర్రతో గీచినప్పుడు వచ్చే శబ్దం. అది మాకు కొత్తేమి కాదు. పది గంటలు దాటగానే అందర్ని పడుకోమని చెప్పటానికి వాడే సిగ్నల్ అన్నమాట. ఆ సిగ్నల్ వినిపించగానే టీవి కూడా ఆగిపోయింది. తరువాత ఖైదీలు పడకల మీదకు అలసిపోయిన శరీరాలకు విశ్రాంతినిద్దామనుకోవటం క్షణాల్లో జరిగింది.

జైలు ఊచల శబ్దంతోపాటు వార్డెన్ అడుగుల సవ్వడి మనల్ని దాటి వెళ్ళిపోయాయి. వార్డెన్ దూరంగా వెళ్ళాడని నమ్మకం కుదరటంతో మరలా నాగేంద్ర పడుకునే తన మాటలు కొనసాగించాడు. "నాకీ హత్యతో ఏమాత్రం సంబంధం లేదు. ఆ సంఘటన దగ్గరగా నేనుండటం, హత్యచేసిన వాళ్ళ దగ్గర పనిచేస్తుండటం, సాక్ష్యాలను తమకు అనుకూలంగా మార్చుకొని పూర్తిగా న్యాయాన్ని వాళ్ళవైపు తిప్పుకున్నారు. వాళ్ళకు పడాల్సిన శిక్ష నాకు పడింది" అతని గొంతు జీరబోతుండటంతో మౌనం అతని మాటలకు అడ్డుపడింది.

"ఏ నేరస్తుడు నేరం ఒప్పుకోడు. శిక్ష పడ్డ తరువాత కూడా ఏ పాపం తెలియకుండానే ఇంతమంది శిక్షలు అనుభవిస్తున్నారా."

నా మాటలు అతనిని రెచ్చగొట్టినట్లుంది. చివ్వున లేచాడు. చేతులు వెనుక్కు పెట్టుకొని ప్రక్కమీద అలాగే కూర్చొని అన్నాడు. "జైలులో ఉన్న వాళ్ళందరు నేరం చెయ్యలేదు అని నేను అనడంలేదు. కొంతమంది అమాయకులు బలిపశువులు అవుతున్నారని మాత్రమే అంటున్నాను. స్వార్థం మనిషిని అధఃపాతాళానికి తోస్తుంది. ప్రక్క మనిషి కష్టాన్ని దోచుక తినడం అలవాటుపడ్డ మనుషులు తాము సాధించింది ఏమిటో తెలుసుకొనే నాటికి తమే ఈ లోకాన్ని వదిలేస్తారు. చస్తూ కూడా తాను చేసిందే 'కరెక్టు'అనుకుంటే అంతకన్నా మూర్ఖుడు మరొకడుండడు". అతని చివరి మాటల్లో మంచిచెడుల నిర్ణయం అతని కోపాన్ని కొంత తగ్గించినట్లుంది. ఎంత వేగంగా లేచాడో అంతే ప్రశాంతంగా మళ్ళీ పడుకున్నాడు.

అతనిని అనవసరంగా రెచ్చగొట్టాననిపించినా అతని మనస్సు అర్థంకావటానికి ఆ మాత్రం ట్రీట్‌మెంట్ అవసరమేమోననిపించింది. అతను ఇచ్చిన ఉత్తరాన్ని జైలువారిచ్చిన బట్టల మడతలోపెట్టి ఆ బట్టలను నా తల క్రింద పెట్టుకున్నాను. అంతకన్న ఆ ఉత్తరం పెట్టటానికి మరోచోటు ఎక్కడుంటుంది జైల్లో.

శివాలయం చేరుకోవడంతో కలవరపెడుతున్న ఆలోచనలను ఆపివేసి ఎవరికి కనిపించకుండా ఒక మూల కూర్చొని జేబులోని కవర్ తీసాను. ఉత్తరం చదవబోయే ముందు చుట్టూ పరిసరాలను మరోసారి పరిశీలించాను. ఆ బ్లాక్ వార్డెన్ నన్ను గమనించినట్లుంది. నావైపే వస్తున్నాడు. అతనికి నేనంటే అభిమానం దానికి కారణం వేరేమి లేదు. అతనితో అభిమానంగా గౌరవంగా మాట్లాడ్డం నేను అమాయకంగా జైలుకొచ్చాను అనే నా పట్ల ఉన్న సానుభూతి.

"ఏమిటీ ఇక్కడకొచ్చావ్" అన్నాడు నా దగ్గరకొచ్చి.

"ఏమిలేదు సార్ దేవుని దగ్గర కాస్త ప్రశాంతత దొరుకుతుందని."

"అదేం కాదులే నీ సెల్‌లో 'ఉన్నతను' ఉరివేసుకొన్నాడట్గా, ఆ విషయం నీకు బాధ కలిగించి ఉంటుంది."

"అది కూడా నిజమే కావచ్చు" నేను ముక్తసరిగా సమాధానం చెప్పటంతో నన్ను వదిలేసి అతను దూరంగా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళడంతోనే ఇంకా ఎవరైనా వచ్చేలోపలే ఆ ఉత్తరం చదవడం పూర్తిచేయడం మంచిదని ఉత్తరం తీసి చదవడం మొదలుపెట్టాను.

డియర్ సుజీ


నువ్వు క్షేమమని తెలచెదను. పిల్లలు నువ్వు ఉండగా వారు క్షేమంగా వుండే వుంటారని అనుకుంటాను. మనం ఎన్నో కలలు కంటాము. ఆ కలలు నిజం చేసుకోవాలని ఆకాశాన్ని హద్దుగా చేసుకొని నిచ్చనలేస్తాం. అనుకోని ఆపదలు చుట్టుముట్టడమే జీవితం అనుకుంటాను.

జరిగిపోయిన కాలం ఎంత గొప్పది. మీతో గడిపిన మధుర క్షణాలు మళ్ళీ వస్తాయా. సాయంత్రం కాగానే ఇంటి ముందు నాకోసం ఎదురుచూసే నువ్వు పిల్లలు. "డాడి" అంటూ పెద్దగా అరుస్తూనే కాళ్ళకు చుట్టుకునే పిల్లలు. పిల్లలను ఎత్తుకున్న నన్ను ముందు 'స్నానం చేసి రండి' అనే నా కష్టాన్ని మరచే నీ మాటలు. మామూలు జనానికి అయితే ఇవి అన్ని రొటీన్ జీవితపుచ్ఛాయలే, కాని జైలు జీవితపు ఒంటరితనం ఇంత చిన్న విషయంలో కూడా ఏదో మాధుర్యం నిండి నిండుగా కనిపిస్తుంది. భావం వ్యక్తంచేయలేని ఖైదీలు చాలామంది ఉన్నారు. కాని ప్రతి ఖైదీలోను ఇవే భావనలు నిండి ఉంటాయి అనుకుంటాను.

ఉదయం లేవగానే టిఫెన్, పన్నెండు గంటలకు భోజనం, ఒంటి గంటకు 'టీ', అయిదు గంటలకు రాత్రి భోజనం, ఆదివారం మాంసాహారం, పండుగలకు పిండివంటలు. ఈ పాడు తిండికోసమే బ్రతకాలా? తినడం కోసమే బ్రతకడం అనుకునే జీవితం వ్యర్థముకదా! స్వేచ్ఛ లేని, నాకోసం ఎవరూ లేని ఈ భయంకర జీవితం గడపటమే దుర్భరం.

క్రింద కోర్టుల్లో పడ్డ శిక్షనే హైకోర్టుకూడా ఖాయపరచవచ్చని వేరే వాళ్ళ ద్వారా తెలిసింది. అదే నిజమైతే జీవితం మీద నేను పెట్టుకున్న ఆశలు కూలిపోతున్న పేక మేడలే. నీతో పిల్లలతో కలిసి ఉండటం ఒక కలే.

దిక్కు లేని అనాధ శవాలెన్నో ఈ నాలుగు గోడల మధ్య నుండి నిశ్శబ్దంగా వెళ్ళిపోతున్నాయి. నేను అలాగే వెళ్ళిపోతాను. మరలా నా శవంపై పడి నువ్వు పిల్లలు రోధిస్తుంటే ఆ ఊహ నాలో మరింత వేదన కలిగిస్తుంది. ఈ విషయాన్ని



మనం ఎన్నో కలలు కంటాము. ఆ కలలు నిజం చేసుకోవాలని ఆకాశాన్ని హద్దుగా చేసుకొని నిచ్చనలేస్తాం. అనుకోని ఆపదలు చుట్టుముట్టడమే జీవితం అనుకుంటాను.

పిల్లలకు తెలియనివ్వకు.

"డాడీ" అని పిల్లలు పిలుస్తున్నట్లేననిపించి నిద్రలో ఎన్నిసార్లు ఉలిక్కిపడి లేచినో లెక్కేలేదు. జైలు చువ్వలు వంచుకొని మీ ముందు ఉండాలని ఎన్నిసార్లో అనుకున్నా అది వీలుగాదు అని తెలిసినా, మీరు తిన్నారో, లేదో అనే దిగులుతో ఎన్నోసార్లు అన్నం తినకుండా పడుకునే వాడ్ని. అందరూ నిద్రించిన తరువాత నిద్ర పట్టక లేచి కూర్చొని మీకోసం రోధించేవాడ్ని.

నాలాంటి వారు చాలమంది ఉన్నారిక్కడ. కాని భిన్న మనస్తత్వాల సమ్మేళనం ఈ లోకం నా మనసెప్పుడు త్యాగాన్నే కోరుతుంది కనుక నేనిలా ఆలోచిస్తున్నానేమో అనుకున్నాను. కాని మనసుని చంపుకొని వేరే విషయాలతో తమ మనస్సుల్లో ఆనందం నింపుకుంటున్న వారు చాలమంది ఉన్నారు.

నాతో కలసి కష్టాలను, సుఖాలను, మంచిచెడ్డలను సహనంగా పంచుకొనడమే కాదు. ఒక్కొక్కప్పుడు నాకన్న ఎక్కువ బాధను అనుభవించే దానివి, నేను చనిపోవాలని తీసుకున్న నిర్ణయం తెలియజేయకపోవడం ద్రోహమే అవుతుంది. ఒంటరిగా కూర్చొని తృప్తిగా నువ్వు నాలుగుగోడల మధ్య దుఃఖించు. పిల్లలకు నా చావు ఏమాత్రం బాధ కలుగకుండా చెయ్యి.

నా చావు నీలో ఏమాత్రం నిరాశ కలిగించకూడదని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. నీకు బాధ్యతలు ఉన్నాయి కనుక నువ్వు బ్రతకాలి. ఈ నిశ్శబ్ద నిశీధిలో మీ మధుర జ్ఞాపకాలను మనసులో నింపుకొని నన్ను తన వడిలో లాలిస్తావని పిలుస్తున్న మృత్యుదేవత వడిలో హాయిగా శయనిస్తా జహాపన్‌లా. ఇంత హాయి అయిన ఈ మరణ శయనం వదలి మృత్యుదేవతను మందలించి ఉత్త చేతులతో ఎలా పంపను.

జైలు చువ్వల మధ్యగా చూస్తున్నప్పుడు తెల్లని వెన్నెల్లో దూరంగా కనిపించే రాళ్ళలో మీ రూపాలను ఊహించుకొని మిమ్మల్ని దగ్గరకు రమ్మని పిలిచి, అవి కదలని రాళ్ళని తెలిసి కన్నీటితో ప్రక్క గుడ్డలు తడిచిన రాత్రులెన్నో. మరణం తరువాత మరో లోకం ఉంటుందా. అక్కడ నీ రాక కోసం ఎదురు చూద్దామని.

ఆశ నిరాశలు నాలో పోటీపడుతున్నాయి 'సుజీ'. ఇక ఈ మానసిక క్షోభ తట్టుకోలేను. ఇంత క్షోభ తట్టుకొని నేను ఈ నాలుగు గోడల మధ్య జీవించి సాధించగలిగింది మాత్రం ఏముంది. అందుకే చచ్చిపోవాలనుకుంటున్నాను. ఈ జీవిత ఖైదుకన్నా ఉరిశిక్షే నయమనే పరిస్థితి నాలో ఉంది. అందరూ అలా అనుకోక పోవచ్చు కాని నాలాంటి మనస్సులకు ఈ శిక్షకన్నా మరణశిక్షే నయం. అందుకే కోర్టు వెయ్యలేని, వెయ్యని శిక్షను నాకు నేను వేసుకొని మీ అందరికి కనిపించకుండా దూరంగ- చాలదూరంగా విహంగంలా ఎగిరిపోతున్నాను. జీవితంలో ఇక నాకు ఇంకేమి మిగిలింది విషాదం తప్ప. నా బ్రతుకు ప్రక్కనేముంది మరణమృదంగం తప్ప. ఇంకా ఈ జీవిత లక్ష్యమేముంది మరణం తప్పా.

నా ప్రాణమైన, హితురాలువైన, స్నేహితురాలువైన, అన్నీ నీవై నన్ను నడిపావు. అందుకే ఇంకో జన్మంటూ ఉంటే నీ ఋణం తీర్చుకుంటాను.

జీవితం మధురమైందికదూ. దూరమైన కొలది అనురాగం మరింత పెరుగుతుంది కదా! నేను అసలు లేనని నీకనిపించినప్పుడు నీ ప్రేమానురాగాలను పిల్లలమీద పెంచుకొని వాళ్ళను ఇంకా బాగా చూసుకుంటావని నా నమ్మకం. బ్రతుకు పట్ల నిరాశ పెంచుకోకు. ఎందుకంటే నీకు బాధ్యతలు ఉన్నాయి కనుక. సమస్యలు లేనప్పుడు కూడా మనిషి నిరాశపడటం సహజం. ఏ కోర్కె ఆశలు లేని మనస్సును అనుక్షణం బ్రతకమని ఆజ్ఞాపించలేను. నా జీవితకాలం పూర్తయిందన్న నమ్మకం నాలో చావాలనే కోర్కెను పెంచుతుంది. ఇక ఈ ఉత్తరం ముగిస్తాను.

ప్రేమతో నీ నాగు.

మనస్సు భారంతో వికలమైపోయింది. కన్నీరు బొట్టు బొట్టుగా రాలి నేలమీద పడుతున్నాయి. మేఘాలు క్రమ్ముకొచ్చినా చుక్కల వర్షాలను రాలుస్తున్న ఈ కాలపు మేఘాల్లాగా నాగేంద్ర పరిస్థితి ఏమిటో తెలియలేదు. అది తెలియడానికి మరింత కాలం పట్టవచ్చు.

అతను చనిపోయినా నేను దుఃఖపడను. అతను చనిపోయి సుఖ పడతాడు గనుక, అతను బ్రతికినా ఆనందించను. అతను చస్తూ బ్రతకాలి కనుక. అతను చావే అన్నివిధాల తగినదని భావించిన అతన్ని బ్రతికించటం వల్ల ప్రయోజనమేముంది. అతనికి శిక్ష తగ్గిన, ఈ శిక్ష నుండి విముక్తుడయితేనే అతని కోర్కె నెరవేరుతుంది. న్యాయం అతనివైపు ఉన్నా చట్టపరిధిలో అతను దోషి. ఆత్మహత్య ప్రయత్నం మరో నేరం. బ్రతకటానికి మార్గం చూపని చట్టాన్ని మనమెందుకు గౌరవించాలి. చట్టపరిధిని మరింత విస్తృత పరిస్తే నాగేంద్ర లాంటి కొంతమంది అమాయకులైన శిక్షల నుండి తప్పించుకోవచ్చేమో. ఇలా అర్థంలేని ఆలోచనలు నా మనస్సును గజిబిజి చేస్తుంటే ఆ ఉత్తరాన్ని నాగేంద్ర భార్యకు పంపాలో వద్దా అనే ఆలోచనలో పడ్డాను. అతను ఏ ప్రమాదానికి గురికాకపోతే వాళ్ళావిడ ఏమైనా చేసుకుంటే- ఇవన్నీ కాదు అతను చెప్పిన ప్రకారం మంచయిన, చెడ్డయిన ఆ ఉత్తరం పంపాల్సిందే. లేకుంటే అతనికి ద్రోహం చేసిన వాడినవుతాను. కాని నా మనస్సు నిర్ణయం ఏమిటో అర్థంకాక అడుగులు ముందుకేస్తున్నాను.

సాయంత్రం సూరీడు కోటలా ఎత్తుగా ఉన్న జైలు గోడల మాటుగా నక్కి కూర్చున్నాడు తనకి ఏ సమస్యతో ప్రమేయమే లేదని.

★